కథ

# ప్రయాణం

## పొత్తూరి విజయలక్ష్మి

స్టేషన్ ముందు ఆటో ఆగింది. అందులోంచి దిగారు శకుంతల, సత్యం. శకుంతల ఆటోకి డబ్బిస్తూవుంటే సామాన్లు దించాడు సత్యం. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. హౌరా మెయిల్ రైట్ టైం అని చెప్పారు ఎంక్వయిరీలో. ఇద్దరూ ప్లాట్‌ఫాం మీదికి చేరుకున్నారు. మరికొంచెం సేపట్లోనే ధనధనమంటూ వచ్చేసింది మెయిల్. వీళ్ళకు కొంచెం దూరంలో ఆగింది ఎ.సి. ఫస్ట్ క్లాస్ బోగీ. 'రండి! రండి!' అంటూ సామాన్లతో పరుగెట్టాడు సత్యం. సాధ్యమైనంత వేగంగా అతడిని అనుసరించింది శకుంతల. వాకిలి దగ్గర అటెండెంటు ఛార్ట్‌లో పేరు చూసుకుని పక్కకు తిరిగి దారిచ్చాడు.

సత్యం సామాన్లతో వేగంగా లోపలికెళ్ళి వాటిని సర్ది మళ్ళీ తూనీగలా వచ్చేశాడు. చేతిలో సిద్ధంగా వుంచుకున్న పాతిక రూపాయిలు అతనికి ఇచ్చింది శకుంతల. అందుకుని జేబులో కుక్కేసుకుని రైలు దిగిపోయాడు సత్యం. రైలు కదిలింది. తన కంపార్ట్‌మెంట్‌లోకి వెడుతూ కారిడార్లో ఎదురైన శాల్తీని చూసి ఉలిక్కిపడింది శకుంతల.

ఇదేమిటి? ఈ అవతారం లోపలికెలా వచ్చింది? అటెండెంటు చూడలేదా? ఆశ్చర్యపోతూనే తన కేబిన్‌లోకి వెళ్ళింది. వెనకాలే దిళ్ళూ, వక్కబట్టలూ పట్టుకొచ్చాడు అటెండెంట్. పక్క పరిచి మంచి నీళ్ళు తెచ్చిపెట్టాడు. "బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటారా మేడమ్?' అని అడిగాడు వినయంగా.

"టిఫిన్ వద్దు. కాఫీ చాలు". అది సరే! అంటూ ఆ శాల్తీ గురించి అడగబోయిన శకుంతల ఆగిపోయింది. మెల్లిగా చీమలా నడుస్తూ వచ్చి తన ఎదురుగా వున్న బెర్త్ మీదికి ముందు ఒక కాలు పెట్టి రిక్షా ఎక్కినట్టు ఎక్కి ముడుచుకుని కూర్చుంది ఆ అవతారం.

హోరావులించి చూస్తూ వుండిపోయింది శకుంతల. ఈ శాల్తీ తను అనుకున్నట్టుగా ఆ బాపతు కాదు. పైపెచ్చు తన సహ ప్రయాణీకురాలు. తల విదుల్చుకుని మరోసారి పరిశీలించి చూసింది. బాగా పొడుగ్గా వుంది. నల్లటి నలుపు. జాకెట్టు వేసుకోలేదు. చీరె అదేదో పద్ధతిలో కట్టుకుంది. తలమీదుగా కొంగు కప్పకుంది. భుజాలమీదుగా శాలువా.

నోటిలో ఇమడక బయటికి పొడుచుకొచ్చిన పళ్ళు. చిన చిన్న కళ్ళు. వెడల్పాటి ముక్కు. ఆ ముక్కుకి రెండు వైపులా పెద్ద పెద్ద వెండి ముక్కు పుడకలు. ఆ అవతారాన్ని చూసి ఒంటిమీద తేళ్ళూ, జర్రులూ పాకినట్టయ్యింది శకుంతలకి. హారి భగవంతుడా! అనుకుంటూ నీరసంగా మేను వాల్చింది.

తనకి డబ్బుకు కొదవ లేదు. దూర ప్రయాణం కాబట్టి సుఖంగా వెళ్ళాలని తన ఆశ. ఏసీ టూ టయిర్‌కి వెళ్తే నానా అవస్థ. గొంతు చించుకుని రాజకీయాలు మాట్లాడే గుండుపిక్కల్లాంటి నలభై ఏళ్ళ ఫ్రీడమ్ ఫైటర్లూ... పులిహోరలూ, దిబ్బ రొట్టెలూ తింటూ ఆ పళ్ళేలు కడుక్కుంటూ నానా హడావిడీ చేసే పాస్ హోల్డర్లూ, సైరన్‌లా గురకపెట్టే మహాశయులూ. ఆ నరకం భరించలేక, అంతకు రెట్టింపు డబ్బు ఖర్చుపెట్టి ఏసీ ఫస్ట్ క్లాసులో ప్రయాణం చేస్తోంది శకుంతల. మరి ఇలాంటి చోటుకి కూడా ఇటువంటి మనుషులు తయారైతే ఏమిటి గత్యంతరం? అనుకుంది. రాత్రంతా నిద్ర లేదు. రైలెక్కగానే పడుకోవాలని అనుకుంది. కానీ వీలైతేనా? ఎదురుగా కావలసినంత సందడి.

ఇంకా విజయవాడ రాకుండానే పై బెర్త్‌ల మీద పడుకున్న ఇద్దర్నీ లేపేసింది. కళ్ళు నలుముకుంటూ గభాల్న లేచి కిందికి దిగారు ఆ ఇద్దరూ. ఆ యువకుడికి పాతికేళ్ళు వుంటాయి. ఆ అమ్మాయికి ఇరవై వుండవచ్చు. ఆ ముసిలావిడ ఏదో చెప్పింది. వెంటనే ఆ అమ్మాయి పేస్టూ, బ్రష్షూ తీసుకుని ఆవిడ వెంట వెళ్ళింది. విజయవాడలో ఓ కప్పు టీ తాగింది. చీటికి మాటికీ టాయిలెట్‌కి వెళ్ళమా, రాగానే మంచినీళ్ళు తాగమా! ఇదీ వరస. ఆ అమ్మాయి ఆవిడ అడగటం ఆలస్యం మంచినీళ్ళు అందిస్తోంది. టాయిలెట్‌కి వెళ్తాను అని అనగానే ఆ యువకుడు జాగ్రత్తగా లేవదీసి శాలువా కప్పి చెప్పులు తొడిగించి డోర్ దాకా సాగనంపుతున్నాడు. ఆ గొడవంతా చూస్తుంటే 'తినగానే నిద్ర అంటారు. లేవగానే ఆకలి అంటారు' అనే ఓ వ్యంగ్య కార్టూన్ క్యాప్షన్ గుర్తుకొచ్చింది శకుంతలకు.

రాజమండ్రిలో వాళ్ళిద్దరూ బ్రేక్‌ఫాస్ట్ తిన్నారు. ఆవిడ మాత్రం ఒక ఇత్తడి గిన్నెలో అటుకులు, పాలు, పంచదారా వేసుకుని తిన్నది. దొంతు కూర్చుని జుర్రుకుంటూ, వేళ్ళు నాకుతూ ఆవిడ తినే పద్ధతి చూసి కడుపులో తిప్పింది శకుంతలకి. పక్కకి తిరిగి కళ్ళు మూసుకుని పడుకుంది.

మధ్యాహ్నం భోజనాల దగ్గరా అదే తంతు. ముగ్గురికీ భోజనం ఆర్డరిచ్చారు. టిఫెన్ లాగే భోజనం కూడా దొంతు కూర్చుని తినడం మొదలుపెట్టిందావిడ. తనకి వద్దనుకున్నవన్నీ వాళ్ళ ప్లేట్లల్లో వేసింది. నీళ్ళ గ్లాసు దొర్లించింది. అక్కడే వున్న వాష్ బేసిన్‌లో చేయి కడుక్కొని చుట్టుపక్కలంతా నీళ్ళు చల్లేసింది. శకుంతలకి ఏడుపు వచ్చినంత పనయింది. ఎలాగో బలవంతాన నాలుగు ముద్దలు మింగింది.

భోజనం చేశాక మందు వేసుకుని పడుకుంది ఆవిడ. దాంతో కాస్త సందడి సద్దుమణిగింది. ముడుచుకుని పడుకున్న ఆవిడ కాళ్ళ దగ్గర కూర్చున్నాడతను. ఆవిడ పక్కనే కిటికీ దగ్గర కూర్చుంది ఆ అమ్మాయి. ఆవిడ కాళ్ళు రాస్తూ భార్యతో మాట్లాడుతున్నాడు. ముసి, ముసి నవ్వులు నవ్వుతూ అతనితో మాట్లాడసాగింది ఆ అమ్మాయి. తల తిప్పకుని కిటికీ లోంచి బయటకు చూడసాగింది శకుంతల. కాసేపటి తరువాత లేచి ఆవలిస్తూ పై బెర్త్ మీదికి వెళ్ళి పడుకున్నాడు అతను.

ఆ అమ్మాయి అక్కడే కూర్చుంది. కొత్త ఫ్యాషన్ పాలియెస్టర్ చీర కట్టుకుంది. పాపిడిలో సింధూరం. చేతులకి నిండుగా మట్టి గాజులు. నాజూగ్గా వుంది. తనవంకే పరిశీలనగా చూస్తున్న శకుంతలతో చూపు కలిపి పలకరింపుగా నవ్వింది బుగ్గ సొట్టపడేలా. సమాధానంగా నవ్వింది శకుంతల.

"మీరు ఎక్కడికి వెళ్తున్నారు?"అడిగింది ఆ అమ్మాయి.



"కలకత్తా. మరి మీరో?" అంది శకుంతల. ఆ ప్రశ్నకు సమాధానం చెబ్తూ చాలా సమాచారం అందించింది ఆ అమ్మాయి.

వాళ్ళది బరంపురం దగ్గర ఏదో పల్లెటూరు. భువనేశ్వర్ వెళ్తున్నారు. ఒరిస్సాలో ఏదో తెగకి చెందినవారు. ఆవిడ ఆ అమ్మాయి అత్తగారు. ఆవిడకి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఎక్కడో దగ్గర్లోనే చిన్నపని చేసుకుంటున్నాడు. ఇతను రెండోవాడు. ఇంజనీరింగ్ చదివి ఐ.ఆర్.ఎస్ ప్యాసై రైల్వేలో ఆఫీసరుగా పని చేస్తున్నాడు. వాళ్ళ పెళ్ళయి రెండు నెలలైంది.

ఆ పెద్దావిడకి ఆరోగ్యం బాగుండక ఛాతీలో నెప్పి వస్తుంటే పెరంబూరు రైల్వే ఆస్పత్రిలో చూపించమన్నారట. అక్కడికి వెళ్తే వాళ్ళు ఆపరేషన్ అవసరం లేదని మూడు రకాల వైద్యం చేసి పంపించారట. ఎలాగూ కదిలాం కదా అని ఆవిడని తిరుపతి, కాళహస్తి, కంచి తదితర పుణ్య క్షేత్రాలు తిప్పి చూపించి ఇంటికి తీసుకెళ్తున్నారట.

తల్లి అంటే భర్తకి ఎంతో గౌరవమట. పాపం! ఆవిడ చిన్నతనానే భర్త చనిపోతే కాయకష్టం చేసి



## కిషోర్‌కుమార్ ఇంట్లో షూటింగ్

కిషోర్‌కుమార్ బతికున్న రోజుల్లో చిన్న సైజు రాణి వాసంలా వెలుగొందిన అతని బంగళా ఇప్పుడు కొడుకు అమిత్ కుమార్ హయాం లోకి వచ్చే సరికి షూటింగ్ వేదికగా మారింది కింది భాగమంతా ఇప్పుడు సినిమా షూటిం గ్‌ల కోసం అద్దెకిస్తున్నాడు. అడిగితే 'లంకంత కొంపలో ఉండే మనుషులం తక్కువైనప్పుడు ఇలా షూటింగ్‌లకు ఇచ్చి నాలుగు రాళ్లు

పిల్లలని పెంచిపెద్ద చేసిందట. తల్లిని తన దగ్గరే వుంచుకున్నాడుట. భద్రంగా చూసుకుంటాడట. అనారోగ్యం వల్లా, తిరుగుడు కారణంగానూ అల సిపోయిందనీ, ఆవిడకి సౌకర్యంగా వుంటుందనీ తన పాస్ మీద డబ్బు కట్టి ఈ కంపార్ట్‌మెం ట్‌లో తీసుకెళ్తున్నారట. వచ్చీరాని ఇంగ్లీషులో, హిందీలో గలగలా మాట్లాడుతున్న ఆ అమ్మాయి అత్తగారు లేవడంతో మాటలు ఆపి ఆవిడ సేవలో మునిగిపోయింది.

పరీక్షగా ఆవిడ వంక చూసింది శకుంతల. అప్పటి వరకూ పేరుకున్న జుగుప్స, అసహ్యం తరిగి జాలి కలిగింది. పాపం కాయకష్టం చేసి వడలిపోయింది అనుకుంది. సంచీలో పెట్టిన పుస్తకం తీసుకుని నడుం వాల్చింది.

మరో అరగంటలో ఆ అబ్బాయి నిద్ర లేచి కిందికి వచ్చాడు. తల్లి బాధ్యత తను అందుకుని భార్యను పడుకోమన్నాడు. ఆ అమ్మాయి వెళ్ళి పడుకుంది. అతను తల్లి పక్కనే కూర్చుని కమలా పండ్లు ఒలిచి తినిపిస్తూ కిటికీలోంచి కనపడుతున్న వింత చూపిస్తూ వుంటే, ఎత్తుపళ్ళు మరింత కన్పించేలా నవ్వుతూ ఆనందిస్తోంది ఆవిడ. హఠాత్తుగా కొరబోయింది. దగ్గుతో ఉక్కిరిబిక్కిరైపోయింది. తల్లి వీపు నిమురుతూ కంగారుగా భార్యను కేకేశాడు. ఆ అమ్మాయి చెంగున దూకి మంచి నీళ్ళు అందించింది. కాసేపటికి ఆ దగ్గుతెర తగ్గి ఊపిరి తీసుకుంది ఆవిడ. బాగా హైరానా పడిందేమో ఆయాసపడుతూ, ఏడుస్తూ ఏదో గొణి గింది. గభాల్న తల్లిని దగ్గరకు తీసుకున్నాడు కొడుకు. తల నిమురుతూ చెంపల మీదికి జారిపోతున్న కన్నీళ్ళు తుడుస్తూ ధైర్యం చెబుతు న్నాడు. బలమైన కొడుకు చేతులలో గువ్వపిట్టలా ఒదిగిపోయి నీరసంగా కళ్ళు మూసుకుంది ఆ తల్లి.

చదువుకున్న పుస్తకం పక్కన పెట్టి పక్కకి తిరిగి పడుకుంది శకుంతల. మనసంతా దిగులుగా అయిపోయింది. చెప్పలేని ఆవేదన కలిగింది. తనదీ ఆవిడ వయసే. తనూ ఆవిడలా కష్టపడి పిల్లలను పెంచి పెద్ద చేసింది. ఆవిడలా ఆర్థికంగా పేదరికం అనుభవించకపోవచ్చు. కానీ తన బాధ తనకుండేది. వ్యసనాలమారి భర్తతో బాధలు పడుతూ ఆస్తి హరించుకు పోకుండా జాగ్రత్త వహిస్తూ పిల్లలను పెంచుకుంది. భర్త కాలం చేశాక ఆశపరులైన దాయాదులతో తంటాలు పడుతూనే పిల్లలని చదివించింది. ఇద్దరు కొడుకులూ బాగా చదువుకున్నారు. ఒకడు కలకత్తాలో, రెండోవాడు బొంబాయిలో ఉద్యోగాలలో చేరారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. కోడళ్ళకీ ఉద్యోగాలు. సుఖంగా వున్నారు.

సొంత ఊళ్ళో వుంటోంది శకుంతల. పొలాలూ, తోటలూ.. పనివాళ్ళతో పేచీలూ. సవాలక్ష వ్యవహా రాలు. బాధ్యతలు. వయసు మీద పడుతూ వుంటే శరీరం, దానితో పాటు మనసూ దుర్బలమైపోతు న్నాయి. మనిషి సాయం, ఆదరణా కోరుకుంటోంది మనసు. ఆ ఆశ తీరే మార్గం మాత్రం కనిపించడం లేదు. కొడుకులదీ, కోడళ్ళదీ అదే ధోరణి. వాళ్ళకు ఉద్యోగాలు, పిల్లల చదువులు..తీరిక దొరకదు. ఏడా దికో, రెండేళ్ళకో ఓసారి వస్తారు తన దగ్గరికి. తనను రమ్మనరు. వస్తే పొమ్మనరు. చూడాలని వుందని ఫోన్‌లో చెబితే వెంటనే రమ్మంటారు. తను వెడుతుంది. అక్కడ సౌకర్యాలకి లోటు లేదు. లేనిదల్లా ఆదరణ, ఆప్యాయత. ఏదో వెలితి. చెప్పలేని దూరం. తను ఆ కుటుంబానికి చెందని వ్యక్తి అని అనుక్షణం తనకూ, వాళ్ళకూ అనిపి స్తూనే వుంటుంది. వాళ్ళ వివరాలు, వ్యవహారాలు తనకు తెలియకుండా జాగ్రత్తపడుతూ గుట్టుగా వుంచుతారు. ఏ కొడుకూ పది నిమిషాల పాటు తల్లి దగ్గర కూర్చుని మాట్లాడడు. 'అమ్మా! నీ కష్టం, సుఖం ఏమిటి?' అని ఆదరంగా అడిగి తెలుసుకోరు. కోడళ్ళు బాగానే చూస్తారు. ఏ పనీ చేయనివ్వరు. పిల్లలు ఎక్కడికైనా వెడదాం అన్నా 'ఇప్పుడు కాదు నాన్నా! నాయినమ్మ వచ్చింది కదా! నానమ్మ వెళ్ళిన తర్వాత వెడదాం!' అని వాయిదాలు వేస్తారు. ఆ వాతావరణంలో పది రోజులు వుండేసరికి విసుగనిపిస్తుంది. ఇంతకన్నా ఊళ్ళో వుంటేనే నయం. ఇరుగూ, పొరుగూ కాల క్షేపం అనిపించి 'ఇక నేను వెళ్తానురా అబ్బాయ్! పన్లున్నాయి' అంటుంది. 'అలాగే వెళ్ళిరా అమ్మా!' అని ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తాడు కొడుకు. ఏ కారు డ్రైవరు వెంటో వచ్చి రైలెక్కి 'ఇక చచ్చినా ఇక్కడకు రాను' అనుకుంటుంది. కానీ మనసు కోతి లాంటిది. ఆర్నెల్లు తిరిగేసరికి గాలి మళ్ళుతుంది. వాళ్ళకి తెలియజేసి పక్కింటి వారి అబ్బాయినో, ఎదురింటి వారి మనవడినో సాయం అడిగి ప్రయాణం ఏర్పాట్లు చేసుకుని మనవల కోసం పిండి వంటలు వండుకుని రైలెక్కుతుంది. గత ఏడెనిమిదేళ్ళుగా ఇదే వరస. ఈ వయసుకి ఎందుకొచ్చిన తాపత్రయం? ఉన్నది అమ్ముకుని కొడుకుల దగ్గరికి వెళ్ళిపొమ్మని ఎందరు సలహాలు చెప్పలేదు?

కానీ ఆ ప్రసక్తి కొడుకుల దగ్గర నుంచి రావాలి కదా! మరి వాళ్ళ మనసుల్లో ఏముందో? ఆ మాటే ఎత్తరు. తనంతట తాను అడగడానికి మొహమా టంగా కూడా వుంటుంది. ఈ వయసులో వున్న ఆధారం కాస్తా పోగొట్టుకోవటం తెలివితక్కువేమో అన్పిస్తుంది. ఏం చేయాలో తోచక భగవంతుని మీద భారం వేసి కాలక్షేపం చేస్తూ వున్న శకుంతలకి ఎదురు సీటావిడని చూసి గాయం రేగింది.

ఎంత అదృష్టవంతురాలావిడ? ఎంత ప్రేమ లేక పోతే కొడుకు అంత ఖర్చు పెట్టి తల్లిని వెంటేసుకుని తిరుగుతాడు? అందులోనూ కొత్తగా పెళ్ళయిన వాడు. ఎన్ని ఖర్చులుండవూ? ఇదే డబ్బుతో తనూ, భార్యా రింగురంగా అంటూ తిరిగి రావచ్చు.

తనకు కూడా ఆ అదృష్టం కలిగితే బాగుండు. ఏ కొడుకైనా తనను ఇలా వెంటబెట్టుకుని తీసి కెడితే బావుండు! ఈ అబ్బాయి లాగా తన దగ్గర కూర్చుని 'అమ్మా! నీ ఆరోగ్యం ఎలా వుంటోంది? నువ్వు ఒంటరిగా అక్కడ వుండగలు గుతున్నావా?" అని ఆప్యాయంగా అడిగితే ఎంత వూరటగా వుంటుంది? తన స్థితి తల్చుకుని దిగులుగా నిట్టూర్చింది శకుంతల.

*** *** ***

అర్ధరాత్రయింది. ఇంకాసేపట్లో భువనేశ్వర్ వస్తుంది. లేచి సర్దుకొన్నారు దంపతులు. ఆవిడ వచ్చి శకుంతల పక్క మీద కూర్చుంది. నిద్ర పట్టని శకుంతల కూడా లేచి కూర్చుంది. 'మీ

ఆరోగ్యం జాగ్రత్త. శ్రద్ధగా మందులు వాడండి" అంది ఆవిడతో. "మాజీకి ఇంగ్లీషు రాదు" అంటూ దుబాసీగా మారిపోయింది కోడలు. "ఏం ఆరోగ్యమో! ఏమి మందులో? నావల్ల పిల్లవాడు వలిగిపోతున్నాడు" అంటూ వాపోయింది ఆవిడ. వెంటవే అందుకున్నాడు ఆవిడ కొడుకు. "చూడండి ఆంటీ ఎలా అంటోందో? మీరైవా చెప్పండి. మా చిన్నతనంలో ఆవిడ మాకోసం శ్రమ పడలేదా? ఇప్పుడు ఆవిడని సుఖపెట్టే బాధ్యత మాది కాదా? ఎంత చెప్పినా వినదు" అన్నాడు.
ఆ మాటలు శకుంతలకు ఎక్కడో గుండెలోతుల్ని తాకాయి. తన స్థితి గుర్తొచ్చి గుండె కలుక్కుమంది. ఏం చెప్పాలో తెలియక చేయి జాచి ఆవిడ చేయి అందుకుని స్నేహపూర్వకంగా నొక్కింది. శకుంతల చేతిని ముద్దుపెట్టుకుంది ఆవిడ. వెళ్ళొస్తావని చెప్పి వెళ్ళిపోయారు ముగ్గురూ. ఒంటరిగా మిగిలిపోయింది శకుంతల.

ఆవిడలాగే తనకూ ఆరోగ్యం పాడైతే కొడుకులు ఇలా ఆదరిస్తారా? అన్న ఆశ కలిగింది. తనకు ఆరోగ్యం పాడైతే ఏం జరుగుతుందో అంతలోనే కళ్ళముందు మెదిలింది.

ఇరుగూ-పొరుగూ హాస్పిటల్లో చేర్పించి ఫోన్ చేస్తారు. ఆఘమేఘాల మీద వచ్చి వాలిపోతారు కొడుకులు. డబ్బు పారేసి మరింత ఖరీదైన వైద్యం చేయిస్తారు. మనసులో 'అటో ఇటో తేలిపోతే బావుణ్ణు! ఎన్నాళ్ళని సెలవులు పెడతాం!' అని బెంగ పెట్టుకుంటారు. వాళ్ళ అదృష్టం, తన అదృష్టం బావుండి త్వరగా చిలక ఎగిరిపోతే ఏడ్చి అంత్యక్రియలు జరుపుతారు. "మమ్ములను దుఃఖ సముద్రంలో ముంచిపోయిన మా మాతృమూర్తి" అంటూ పేపర్లలో ప్రకటనలు ఇస్తారు. ఊరు, ఊరంతా మెచ్చుకునేలా ఘనంగా కర్మకాండలు పూర్తి చేస్తారు. ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోతారు.

విరక్తిగా నవ్వుకుంది శకుంతల.

## చంద్రచూర్ సింగ్

మీరూ విన్నారా! అంజలా జవేరి, ప్రియా గిల్, ప్రీతిజింతా, మేఘనారెడ్డి ఇంకా...చాంతాడంత లిస్ట్వుంది. నేను కాదనేవాని కాదు. వాళ్ళంతా నాకు ఫ్రెండ్సే. కానీ వాళ్ళతో నాకున్న అనుబంధాల విషయంలో వినబడే కథలన్నీ కల్పనలేనండి బాబూ. సినిమాల్లో వాళ్ళతో నటిస్తే లేదా ఏదైనా పార్టీలో సరదాగా కబుర్లు చెపుతూ కనిపించినా చాలు కథలల్లేస్తున్నారు! సినిమా కథలకంటే చిత్రంగా ఉన్నాయివి. ఎంతకని ఖండిస్తాం ఇహ నేను నోరు మూసుకొని ఊరుకొన్నా.



## విన్నపాలు

# వినిర్మాణం

తుఫాను వీస్తుందనుకో మనం ముందుగా మన ముంగురుల్ని సవరించుకుంటాం. సప్త సముద్ర సమస్త హస్తాలూ మనల్ని తాగేయాలనుకున్నప్పుడు మన ఎండిన పెదవులకి గోరింటాకు పెట్టుకుంటామన్న మాట. మహా సామ్రాజ్యాన్ని కోల్పోయిన చక్రవర్తి ఒకడు ఓ డప్పు మోసుకుంటూ వచ్చి ఈ స్వేచ్ఛా సైకతం మీద మునివేళ్ళ మీద నించొని ఈ ఇసుకంతా నాదేనంటాడు ఈ నీరంతా నాదేనంటాడు, అతని తిమిర తీరం మీద నేనూ నుంచోని చిర్నవ్వులు చిందిస్తాను. వాడిది ఘోష నాది హేష. ఖడ్గ హస్తాలూ ప్రేమ ముద్రాంకితాలే కట్టుకట్టుకునేందుకు హస్త చికిత్సలు లేవిక. ఎర్ర సముద్రపు మధ్యలో తుఫాను ఎగిసిపాటులో రెండు నౌకా భంగాలు. కరుణ కిరణ సంకేతాలందవు. పురాతన కాసిల్‌ని తమోరణ్యాలు కప్పివేసినయ్. సముద్రాన్ని నువ్వు వెనక్కి వెళిపొమ్మంటావు. గుహ ద్వారాలన్నీ చేతులారా మూసేస్తావు. సప్త సముద్రాలూ గాజుల చేతుల్తో కోలాటమాడుతున్నాయి. రక్త సిక్త ప్రేమోద్విగ్నుడొకడు సాగర రాక్షసి కోరల్ని లాగుతూన్నాడు దీనం కదా దయకదా ప్రేమ కదా సామ్రాజ్య పతనం దీనం కదా దయనీయం కదా ప్రేమ నిష్ఫలం కదా మత్తి మేఘంలా ముంచుకొచ్చిన వృద్ధాప్యపు అసహజ మరణ ప్రయాన కదా తెర వెనక కునుకు కదా

—మో